క్లుప్తంగా

నేటి నుంచి రీ-సర్వే గ్రామ సభలు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలో భూ రీ సర్వే, ఇతర సమస్యల పరిష్కారానికి గ్రామ సభలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ గ్రామ సభలలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్లు హాజరవుతారని ఆమె తెలియజేశారు. గ్రామ సభలు 22న దేవరపల్లి అగ్రహారంలోని కమ్యూనిటీ బిల్డింగ్ నందు, 23న చింతలపూడి, 24న శృంగారపురం, 25న చినపాలెం, 26న మోరంపూడి, 29న తుమ్మపూడి, 30న కంఠంరాజు కొండూరు సచివాలయాల్లో జరుగుతాయని చెప్పారు.

దస్తగిరమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ : వైఎస్సార్ కడప జిల్లా, బద్వేల్‌లో ప్రేమోన్మాది చేతిలో దారుణ హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని దస్తగిరమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని డిమాండ్ చేశారు. సోమవారం దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుభాని మాట్లాడుతూ గత కొంత కాలంగా రాష్ట్రంలో బాలికలు, మహిళలపై లైంగిక దాడులు, హత్యలు, అత్యాచారాలు ఎక్కువయ్యాయన్నారు. బద్వేలు సంఘటన మాత్రమే కాకుండా కర్నూలు జిల్లా మచ్చుమర్రిలో 9 ఏళ్ల బాలిక వాసంతి, పుంగనూరులో ఏడేళ్ల చిన్నారి ఆశియా, కర్నూలు జిల్లాలో ఇంటర్ విద్యార్థిని ఇలా ఎన్నో దారుణ సంఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. రాష్ట్రంలో బాలికల, మహిళల రక్షణ కోసం మరింత పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. దస్తగిరమ్మ కేసులులో నిందితులను కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

నేడు ఎలుకల నివారణ మందు పంపిణీ

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు ఎలుకల నివారణ కోసం మందు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి పి. శిరీష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలుకల నివారణ కోసం బ్రోమోడయోలోన్ 0.25శాతం బీసీతో మందును తయారు చేసి, రైతులకు అందజేయడం జరుగుతుందని, వరి సాగుచేస్తున్న రైతులందరూ నూకలు, నూనె తీసుకుని రైతు సేవా కేంద్రం వద్దకు రావాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

తాడేపల్లిరూరల్ : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నగరపాలక సంస్థ పరిధిలోని ఆధార్ ప్రత్యేక క్యాంపును నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వీజే జూనియర్ కళాశాలలో ప్రత్యేక క్యాంపును నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా మొత్తం ఆధార్ సెంటర్‌లు ఏర్పాటు చేసి సచివాలయ సిబ్బందిని నియమించామన్నారు. అక్టోబర్ 22 నుంచి 25 వరకు నాలుగు రోజుల ఈ ఆధార్ సేవా ప్రత్యేక కాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

పట్నంబజారు: మహిళ మెడలో నుండి చైన్ లాక్కుని పరారైన సంఘటనపై కేసు నమోదయింది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఐపీడీ కాలనీలో నివాసం ఉండే బొమ్మారెడ్డి పద్మావతి సోమవారం మధ్యాహ్నం ఇంటి నుండి బయటకు వస్తున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగుడు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని నల్లపూసలు, నానతాడు లాక్కుని పరారీ అయ్యాడు. ఈ క్రమంలో ఆమె గొలుసు గట్టిగా పట్టుకోవడంతో కొద్దిమేరకు ఆమె చేతిలోనే నిలిచిపోయింది. రూపాయలు రెండు లక్షల విలువచేసే 30 గ్రాములు పైన బంగారం చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుక్మిణీ కల్యాణ పారాయణం శ్రేయస్కరం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కల్యాణ వేదికపై సోమవారం శ్రీమద్భాగవతం- రుక్మిణీ కల్యాణం, కుచేలోపాఖ్యానం ధారావాహిక ప్రవచనాలు మొదలయ్యాయి. ఆలయ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, యల్లాప్రగడ మల్లికార్జున రావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. బ్రహ్మశ్రీ మల్లాది కైలాసనాథ్ మాట్లాడుతూ నేటి యువ తరం రుక్మిణీ కళ్యాణ ఘట్టాన్ని శ్రద్ధగా చదవాలన్నారు. అవివాహితులకు ఒకవేళ పురాణం ఆలకించినా, పారాయణం చేసినా వారికి వివాహం అవుతుందని, చక్కటి వైవాహిక జీవితం, ఆధ్యాత్మికత లభిస్తుందని పేర్కొన్నారు.

పల్లెకు రాని వెలుగు



పల్లె వెలుగు బస్సు

- పలు గ్రామాల ప్రజల అవస్థలు
- ప్రయాణాలకు ఆటోలే గతి
- పాఠశాలల విద్యార్థులకు తిప్పలు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులు రాకపోవడంతో ప్రజలు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆటోలు, పలురకాల వాహనాలను ప్రయాణాలకు ఆశ్రయించాల్సి వస్తోంది. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో తరచూ పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఏడు గ్రామలకు రాని బస్సు

ఫిరంగిపురం టు సత్తెనపల్లి

ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లి వెళ్లేందుకు దగ్గరిదారి కావడంతో బస్సును ఏర్పాటు చేశారు. కాగా, అది రోజుకు రెండుసార్లు ఉదయం, సాయంత్రం మాత్రమే వస్తుండంతో ఆ మార్గంలోని 113 తాళ్లూరు, శిరంగిపాలెం, తక్కెళ్లపాడు గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. మిగిలిన సమయంలో ఆటోలో ప్రయాణించాల్సి వస్తోంది. గంటల తరబడి బస్టాప్‌ల వద్ద వేచి ఉండి వాహనాలలో వెళుతున్నామని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ప్రజలు , విద్యార్థులు కోరుతున్నారు.

పొనుగుపాడు, మునగపాడు, బేతపూడి, గుండాలపాడు, యర్రగుంట్లపాడు, అమీనాబాద్ , వేమవరం గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. గతంలో నరసరావుపేట నుంచి పొనుగుపాడునకు రెండు ట్రిప్పులుగా బస్సు సౌకర్యం ఉండేది, అదికూడా పూర్తిగా రాకపోవడంతో తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు. అలాగే మునగపాడు, బేతపూడి, గుండాలపాడు, యర్రగుంట్లపాడు గ్రామాలకు పూర్తిగా బస్సు సౌకర్యం లేదు. దీంతో వారు ప్రత్యామ్నాయంగా ఆటోలు, ద్విచక్రవాహనాలలో ప్రయాణిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఎక్కువ శాతం వ్యవసాయ పనులు, కూలీ పనులకు ప్రతిరోజు నరసరావుపేటకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో వారు ఆటోల్లో గుంటూరు- నరసరావుపేట అడ్డ రోడ్డు వరకు వచ్చి మరలా అక్కడ నుంచి బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో పనులకు సమయానికి అందుకోలేక పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వివిధ పాఠశాలలు, కళాశాలలకు విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు సైతం ఇదే మాదిరి ప్రయాణించాల్సి వస్తోంది.



సత్తెనపల్లి వెళ్లేందుకు బస్సుకోసం వేచిచూస్తున్న ప్రయాణికులు.

ప్రమాదాల బారినపడుతున్నారు

విద్యార్థులు, పాఠశాలలకు రావాల్సి వస్తుండటంతో ఎక్కువమందితోకూడిన ఆటోలు ఏర్పాటుచేసుకోవాల్సి వస్తోంది. దీంతో పరిమితికి మించి ఆటోలో విద్యార్థులను ఎక్కించుకుంటున్నారని చెబుతున్నారు. గతంలో రేపూడిగ్రామ శివారు వద్ద ఎక్కువమంది ప్రయాణిస్తున్న ఆటో ప్రమాదానికి గురిఅయింది. విద్యార్థులు మృతిచెందారు. దీంతో అప్పుడు గుంటూరు నుండి వేమవరం గ్రామానికి బస్సుసౌకర్యాన్ని కల్పించి తరువాత ఆపివేయడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర అసౌర్యానికి గురవుతున్నామంటున్నారు.

రాత్రిళ్లు నాలుగో సింహం నిద్రపోతోంది..!

- తుళ్లూరు, పోలీస్ స్టేషన్ల మీదుగా ఇసుక అక్రమ రవాణా
- టీడీపీ నాయకుల కనుసన్నల్లో తరలిపోతున్న లారీలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

తాడికొండ: తుళ్లూరు మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. అర్ధరాత్రి టీడీపీకి చెందిన నాయకుల కనుసన్నల్లో భారీ లారీల్లో ఇసుక గుంటూరుకు తరలిపోతోంది. తుళ్ళూరు, తాడికొండ పోలీస్‌స్టేషన్‌ల మీదుగానే ఈ ఇసుక లారీలు వెళ్తుండటం గమనార్హం. నూతన ఇసుక పాలసీని ప్రవేశ పెట్టిన ప్రభుత్వం గుంటూరు జిల్లాలో పలు రీచ్‌లకు వేలం నిర్వహించింది. కానీ తుళ్లూరు మండలంలోని ఇసుక రీచ్‌కు వేలం నిర్వహించకపోవడంతో ఇక్కడ ఇసుక 'శాండ్ విచ్'లా మారింది. గుంటూరుకు అతి సమీపంలో ఉన్న ప్రాంతం కావడంతో తుళ్లూరు నుంచి గుంటూరుకు ఇసుక రవాణా సులభతరంగా ఉంటుంది. అయితే పగలు మాత్రమే ఇసుక రవాణాకు అనుమతించిన కారణంగా రీచ్‌ల వద్ద రవాణా జరుగుతోంది. తుళ్ళూరు ప్రాంతం నుంచి టీడీపీ అనునాయులు పగలు డంపింగ్ చేసుకొని, అర్ధరాత్రి లారీలకు ప్రొక్లెయిన్ల ద్వారా లోడింగ్ చేసి గుంటూరు ఇసుకను తరలిస్తున్నారు. లారీ ఇసుక రూ.25 వేల వరకు ధర పలుకుతుండటంతో అరకొరగా అధికారులకు ముట్ట జెప్పి అక్రమంగా ఇసుకను తరలించేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గంటూరుకు ఇసుక అక్రమంగా తరలించాలంటే ప్రత్యామ్నాయ రహదారులు ఏమీ లేకపోవడంతో తుళ్లూరు, తాడికొండ పోలీస్ స్టేషన్‌లను దాటి ప్రధాన రహదారి మీదుగా ఇసుక లారీలు వెళ్లాల్సి ఉంది. అయితే రాత్రి వేళ అక్రమ దందాను నిలువరించాల్సిన పోలీసు అధికారులు చోద్యం చూస్తుండటంతో అనధికారికంగా టీడీపీ నాయకుల జేబులు నిండుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ దందాకు బ్రేకులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అంటున్నారు.



అర్ధరాత్రి యథేచ్ఛగా తరలిపోతున్న ఇసుక లారీ

పోలీస్ అమర వీరులకు ఘన నివాళులు



స్టేషన్ వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు



అమర వీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు

మంగళగిరి: పట్టణంలోని 6వ బెటాలియన్‌లో అమర వీరుల దినోత్సవం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు పోలీసు అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్ వెంకటేశ్వర్లు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేం

ఫిరంగిపురం: అమరవీరుల త్యాగాలు మరువలేనివని సీఐ రవీంద్రబాబు అన్నారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ వద్ద సోమవారం అమర వీరులకు పోలీసు సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐ రవీంద్రబాబు మాట్లాడుతు విధి నిర్వహణలో ఎందరో పోలీసు సిబ్బంది తమ ప్రాణాలు త్యాగం చేశారని చెప్పారు. ఏటా వారి త్యాగాలను సంస్మరణ రోజు గుర్తుచేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైటర్ దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

మణికంఠ సేవా సమితికి అరుదైన గౌరవం



అవార్డు అందుకుంటున్న కొల్లిపరకు చెందిన శంకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి

కొల్లిపర: మహా శాస్త్ర సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముందుండి నడిపిస్తున్న గురుస్వాములకు, స్వచ్ఛంద సేవా సంస్థకు హైదరాబాద్‌లోని మణికంఠ ఫంక్షన్ హాల్‌లో కేరళ తాంత్రీలు విష్ణు నారాయణ పొత్తి, శివనర సింహన్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నట్లు శ్రీమణికఠ సేవా సమితి కమిటీ సభ్యుడు బొంతు వెంకటరెడ్డి(దత్తు స్వామి) తెలిపారు. కొల్లిపరలోని శ్రీ గంగాపార్వతి సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో సేవా సమితి సభ్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తు స్వామి మాట్లాడుతూ పదేళ్లగా కొల్లిపర మండలంలో శ్రీమణికఠ సేవా సమితి అయ్యప్ప భక్తులకు, మాల ధరించిన స్వాములకు అన్నదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాలతో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రతి సంవత్సరం డిసెంబర్ 03 నుంచి జనవరి 13వ తేదీ వరకు అన్నదానం నిర్వహించాలని సభ్యులు అందరూ కలసి తీర్మానించారు. ఉత్తమ సేవా పురస్కారంతో పాటు కొల్లిపర మండల గురుస్వామి జంగా శంకరరెడ్డికి గురు పురస్కారం కూడా రావటం మరొక విశేషం అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఆరిమండ శివరామకృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కొల్లి అంజిరెడ్డి, సెక్రటరీ కొల్లి రఘునాథరెడ్డి, సభ్యులు భీమవరపు రాజశేఖరరెడ్డి, భీమవరపు శివరామిరెడ్డి పాల్గొన్నారు.

బాణ సంచా దుకాణాలకు సింగిల్ విండో అనుమతులు



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో వివిధ శాఖల అధికారులు

తెనాలి: దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలకు సంబంధించిన డివిజన్ స్థాయి సమావేశాన్ని సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ఆదేశాల మేరకు తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సమావేశానికి అధ్యక్షత వహించారు. డివిజను నుంచి మున్సిపల్, రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీస్ అధికారులు హాజరయ్యారు. బాణసంచా విక్రయ దుకాణాల కోసం హోల్‌సేల్/రిటైల్ వ్యాపారులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో మూడు శాఖల సిబ్బంది, దరఖాస్తులను పరిశీలించి, అనుమతులను ఇస్తారని తెలిపారు. హోల్‌సేల్ వ్యాపారులు వీధుల్లో విక్రయించే నిమిత్తం తోపుడుబండ్ల వ్యాపారులకు బాణసంచాను కేటాయించవద్దని, అనవసర ప్రమాదాలకు ఆస్కారం ఇవ్వొద్దని కోరారు. విక్రయ దుకాణాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలను నియమించరాదని చెప్పారు. బాణసంచా వ్యాపారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న చెప్పారు. సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ, బాణసంచా దుకాణాలు ఎల్ ఆకారంలో ఏర్పాటుచేయాలనీ, ఒక్కో దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని చెప్పారు. ప్రతి దుకాణంలోనూ ఇసుక బకెట్లు, నీటి వసతిని అందుబాటులో ఉంచుకోవటం తప్పనిసరిగా వివరించారు. విక్రయదారులు కచ్చితంగా జీఎస్టీ చెల్లించాలని, అప్పుడే వారికి లైసెన్సులు ఇవ్వాలని జీఎస్టీ అధికారి సుధాకర్ చెప్పారు. తెనాలిలో బాణ సంచా దుకాణాల ఏర్పాటుకోసం టీజే కాలేజి, వీఎస్సార్ కాలేజి గ్రౌండ్స్‌లో వర్షంనీరు నిలిచినందున ప్రత్యామ్నాయ స్థలాన్ని చూస్తామని అధికారులు వెల్లడించారు. బాణసంచా వ్యాపారులతో మంగళవారం సమావేశం జరిపి అవగాహన కల్పించాలని నిర్ణయించారు. తెనాలి ట్రైనీ డీఎస్పీ ఎస్.భార్గవి మరివాడ, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు, మంగళగిరి, తెనాలి సీఐలు డి.వినోద్‌కుమార్, వి.మల్లికార్జునరావు, కె.వేదాంతరావు, దుగ్గిరాల తహసీల్దార్ సునీత, సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ జి.సుధాకిరణ్మయి పాల్గొన్నారు.

బాబు పేరు చెప్పి.. వృద్ధురాలికి రూ.లక్ష టోకరా

లక్ష్మీపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా కానుక మంజూరు కావాలంటే పసుపు రంగు చీరపైనే రూ.20 వేలు పెట్టి ఫోటో దిగితే కొన్ని గృహోపకరణాలు ఇస్తారని చెప్పి వృద్ధురాలిని నమ్మబలికి ఆమె వద్ద రూ.1 లక్ష తీసుకుని పరారైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసుల కథనం ప్రకారం అశోక్‌నగర్ 4/2 అడ్డరోడ్డు ప్రాంతానికి చెందిన చెరుకూరి శివకుమారి అనే 75 సంవత్సరాల వృద్ధురాలు ఇంటికి ఒక వ్యక్తి ద్విచక్ర వాహనం పై వచ్చి మీకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా కానుకగా ఫ్రిజ్, టీ.వి, గ్రైండర్ ఇస్తున్నారని నమ్మబలికాడు. అయితే చంద్రబాబు దసరా కానుక రావాలంటే పసుపు రంగు చీరా పై రూ.20 వేలు పెట్టి ఫోటో దిగాలని చెప్పడంతో వృద్ధురాలు నమ్మి ఇంట్లో నుంచి పసుపు రంగు చీరాతో పాటు రూ.1 లక్ష నగదు తీసుకుని బయటకు వచ్చింది. ఇదే అదునుగా భావించి పసుపు రంగు చీరతో పాటు ఎరుపు రంగు చీర కూడా ఉండాలని చెప్పడంతో పసుపు రంగు చీర, రూ.1 లక్ష నగదు ఆ వ్యక్తి చేతిలో పెట్టి మళ్లీ ఇంట్లోకి వెళ్లడంతో వెంటనే సదరు వ్యక్తి పరారయ్యాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జమిలి ఎన్నికలు పెట్టుబడిదారులకు మేలు



లక్ష్మీపురం: పెట్టుబడిదారులకు మేలు చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జమిలి ఎన్నికల నినాదాన్ని తెరపైకి తెచ్చారని సీపీఎం పోలీట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు విమర్శించారు. స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వి.ఐ లెనిన్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సమకాలిన రాజకీయ పరిణామాలపై నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. సభకు సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అధ్యక్షత వహించారు. రాఘవులు ప్రసంగిస్తూ దేశంలో అన్ని రకాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు హేతుబద్ధతలేని సాకులను మోడీ ప్రభుత్వం చెబుతుందన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్. బాబూరావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజి, ఈమని అప్పారావు, ఎస్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఎమ్.రవి, ఎస్.ఎస్.చెంగయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



నగదు చెక్కులను అందజేస్తున్న అనిత

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని పలువురు బాధితులకు సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను అందజేశారు. మండల పార్టీ అధ్యక్షురాలు కేసంనేని అనిత మాట్లాడుతూ దుగ్గిరాల గ్రామం రైలుపేటకు చెందిన జంపాల ఉమామహేశ్వరరావుకు రూ.1.50లక్షలు, గొడవర్రుకు చెందిన విశ్వనాథపల్లి దివ్యకు రూ.75 వేలు చెక్కులను బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశామని తెలిపారు. మంత్రి నారా లోకేష్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారని, పేదవారికి సీఎం సహాయ నిధి ఆపదలో అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణ ప్రసాద్, ఎంపీటీసీ విశ్వనాథపల్లి శివకుమార్, సర్పంచ్ విశ్వనాథపల్లి ఉమాదేవి, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు నరసింహారావు, దేవరపల్లి చంటి, టైలర్ బాషా, ప్రసంగి కొండలు, స్వామి, కేశంనేని వాసు, ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ స్నేహ గీతిక



ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : అర్ధశతాబ్దపు బాల్యం వారిది. నలభై వసంతాల స్నేహ పరిమళం వెదజల్లిన క్షణం అది. గతాన్ని తవ్వుకుంటూ బయట పడిన మధుర స్మృతులను పంచుకుంటూ.. పులకించిన మనసులు వారివి. పెనుమాక వందేమాతరం ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనానికి వేదికైంది. 1983-84లో పదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు..ఉన్నతులై సోమవారం మళ్లీ ఒక్కచోట చేరి ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకుంటూ.. చదువు చెప్పిన గురువులను సత్కరించుకుని సంబరపడిపోయారు. తమకు చదువు చెప్పిన గురువులు గోపిరెడ్డి, సుబ్బాయమ్మ, రాజకుమారి, వెంకటరెడ్డి తదితరులను ఘనంగా సన్మానించారు. గురువుగా తమ జన్మ ధన్యమైదంటూ కోటిరెడ్డి మాస్టరు భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం తమతో పాటు చదువుకుని, అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడిని గుర్తించారు. పెనుమాకకు చెందిన పూర్ణ చంద్రరావుకు రెండు కాళ్లు పోవడంతో అతని కుటుంబ ఖర్చుల నిమిత్తం అప్పటికప్పుడు రూ.45 వేలు అందజేసి, కృత్రిమ కాళ్లను ఏర్పాటు చేసేందుకు స్నేహ హస్తం అందజేశారు.

తమనంపల్లి అమృతరావ్‌కు ఘన నివాళి



అమృతరావు విగ్రహానికి నివాళి

మేడికొండూరు: మండల పరిధిలోని విశదల గ్రామంలో తాడికొండ మాజీ ఎమ్మెల్యే, విశాఖ ఉక్కు సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ఉద్యమాన్ని ముందుకు నడిపించిన తమనంపల్లి అమృతరావు 103వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఆర్‌ఎస్ మేకతోటి దయాసాగర్ హాజరయ్యారు. ముందుగా అమృతరావ్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాద రూపకర్త తమనంపల్లి అమృతరావని, ఆయనను స్మరించుకోవడం ఎంతో ఆనందదాయకమని దయాసాగర్ అన్నారు. జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్దయ్య, తమనంపల్లి శాంతయ్య, మేకతోటి ప్రసాద్ రావు, గేరా బెన్యామెన్, రవి, కొరివి చెన్నయ్య, లూర్దు రాజు, షేక్ రస్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు తప్పని కష్టాలు



ట్రాఫిక్‌ను నిలిపివేయడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



ఉండవల్లి సెంటర్ స్క్రూబ్రిడ్జి వద్ద ఆగిపోయిన ట్రాఫిక్

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయవాడ వెళుతున్నారని సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో వాహనాల రాకపోకల్ని ఆపేయడంతో మంగళగిరి - ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సుమారు గంటసేపు ట్రాఫిక్ ఆపేయడంతో ఉండవల్లి సెంటర్ స్క్రూబిడ్జి, సీతానగరం రోడ్డు నుంచి పోలకంపాడు వైపు, తాడేపల్లి, ఉండవల్లి రోడ్లలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయం కావడంతో ఎవరికివారు త్వరగా వెళ్లాలని ముందుకు వెళ్లడంతో ఎదురుగా వచ్చే వాహనాలు వెళ్లే మార్గం లేక ఇరువైపులా ట్రాఫిక్ మరింత గందరగోళంగా మారింది. అక్కడ ఒక్క కానిస్టేబుల్ మాత్రమే విధులు నిర్వర్తిస్తుండటంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు బాగా సమయం పట్టింది. సమాచారం లేకుండా ఇలా ట్రాఫిక్‌ను ఆపేస్తే ఎలాగంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ట్రాఫిక్ నిలిపేసినప్పుడు నీతులు చెప్పిన పెద్దలకు.. ఇప్పుడు అధికారంలో ఉండటంతో అవి వర్తించవా అని నిలదీస్తున్నారు.

కూటమి హామీ తక్షణమే అమలు చేయాలి

లక్ష్మీపురం: ఎన్నికల ముందు కూటమీ ప్రభుత్వం వలంటీర్స్‌కు ఏదైతే హామీ ఇచ్చారో వాటిని తక్షణమే అమలు పరచాల్సిందిగా రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్ అసోసియేషన్ ఏఐవైఎఫ్ అనుబంధం సంస్థ ఆధ్వర్యంలో అన్ని జిల్లాలో నిరసన కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఏఐవైఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్స్ వ్యవస్థ కరోనా లాంటి సమయంలో చేసినా పనులను కొనియాడారు. కరోనా పేషెంట్స్ దగరకు వెళ్లి టాబ్లెట్స్ భోజనాలు తదితర సహాయాలు అందజేయడంతో పాటు సేవ చేయటంలో వలంటీర్స్ ప్రత్యేక పాత్ర పోషించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వాలంటీర్స్‌కు కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నెలకు రూ.10వేలు, అలాగే ఉద్యోగ భద్రత కల్పించడం జరుగుతుందని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 3 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.